క్లుప్తంగా

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా నూతన పట్టు వస్త్రాలతో, రంగురంగుల పుష్పాలతో, వెండి కవచాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి కర్జూరపండ్లతో నిర్వహించిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడండి

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాజుపాళెం ఏపీఓ వసంతకుమార్ తెలిపారు. మండలంలోని పర్లపాడు గ్రామంలో ప్రాథమిక, జెడ్పీహెచ్ ఎస్, పశువైద్యశాలల్లో శుక్రవారం మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పర్లపాడు గ్రామంలో రాజా గ్రీన్ ట్రస్టు నర్సరీకి చెందిన బీరం వెంకటేశ్వరరెడ్డి ఉచితంగా మొక్కలను ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం పశువైద్యురాలు డాక్టర్ శివజ్యోతి, ఈసీ కరుణాదేవి, హెచ్‌ఎం హనుమంతురెడ్డి, ఉపాధ్యాయుడు సుబ్బయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు, ఉపాధి కూలీలు మొక్కలు నాటారు.

బి. మఠంలో వనం.. మనం

బ్రహ్మంగారిమఠం : వనం- మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తోట్లపల్లె దగ్గర నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం ప్రతీ ఒక్కరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పథక సంచాలకులు బి.ఆదిశేషారెడ్డి, స్థానిక సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, ఉపాధి హామీ అధికారులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు

పోరుమామిళ్ల : పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు శనివారం కడపకు వెళ్లాలని సామూహిక సెలవు పెట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపేంద్ర రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్, సమయపాలన లేని అని ఒత్తిడి, స్వచ్ఛ సంకల్పానికి నిధులు కేటాయింపు చేయకున్నా పారిశుధ్య సిబ్బందితో పని చేయించాలంటూ ఒత్తిడి చేయడం తదితర సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, రవీంద్రారెడ్డి, చెన్న కేశవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణ బాబు, బాషా, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో సోమిరెడ్డిపల్లెలో సర్వే నంబర్ 486, 487లో వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానానికి చెందిన 11.28 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు సంబంధించి శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఒక ఏడాది కౌలుకు బి.మఠంకు చెందిన తిప్పన మాధవనాయుడు రూ.3,14000 వేలంలో దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు క్రైం : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్ తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య నిపుణురాలు డాక్టర్ కవితా ప్రసన్న మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిస కారాదన్నారు. దీని వల్ల యువతలో నేర మనస్తత్వం పెరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురుమూర్తిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.గురుమూర్తిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈయన మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

కార్పొరేట్ ఆసుపత్రుల అడ్డగోలు సంపాదన

ఒంటిపై తెల్లకోటు.. మెడలో స్టెత్‌స్కోప్‌తో హుందాగా దేవుడిని తలచేవిదంగా కనిపించే వర్చస్సు తమసొంతమే అన్నట్లు ఉన్న డాక్టర్ల వ్యక్తిత్వం కాలం గడిచే కొద్దీ మసకబారుతోంది. నాడి పట్టుకుని జబ్బు కనిపెట్టే డాక్టర్లున్న కాలం కాలగర్భంలో కలిసి పోయింది. ఇప్పుడంతా హైటెక్ వైద్యం. జర్వం వచ్చిందని ఆసుపత్రికి వెళ్లితే నాడిపట్టు కొని పరీక్ష చేయవలసిన డాక్టర్ల చేతులు పెన్ను పట్టుకుని తెల్లపేపర్‌పై గొలుసురాత పరుగులు పెట్టిస్తున్నారు. అర గంట ల్యాబ్ టెస్టులకు పది పదిహేను వేలరూపాయలు కరిగిస్తున్నారు. డాక్టర్లు కన్సలటింగ్ ఫీజు రూపేనా రూ.300 నుండి రూ.500 వరకూ దోచుకుంటున్నా చేయిపట్టుకుని నాడీ పరీక్ష చేయడంలేదు. డాక్టర్లు వసూలు చేస్తున్న ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రవేట్ ఆసుపత్రుల దందా వారి ఇష్టారాజ్యంగా కొనసాగు తోంది.

- కన్సల్టేషన్,ల్యాబ్‌ల రేట్లపై కొరవడిన ప్రభుత్వ నియంత్రణ
- రోగనిర్ధారణకు భారీగా కమిషన్లు గుంజుతున్న వైనం
- నాడిపట్టుకుని పరీక్షించే చేతులు ఎక్కడ ?
- వచ్చిన రాబడితో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు
- కోట్లకు పడగలెత్తుతున్న తెల్లకోటు జమీందార్లు

బద్వేలు : తదితర పట్టణాల్లో కొన్ని ప్రముఖ ఆసుపత్రులు.. కొందరు పేరుమోసిన వైద్యులు వసూలు చేస్తున్న ఫీజులు చూసి జనం గుండె పగులుతోంది. రోగి తనకొచ్చిన వ్యాధిని చూసి భయపడటం లేదు. ఆసుపత్రిలో వేసిన బిల్లును చూసి సగం చచ్చిపోతున్నాడు. వచ్చిన రోగం నుంచి ప్రాణాలు దక్కించుకునేందుకు ఆస్తులు అమ్ముకున్నా అప్పులు తీర్చలేని పరిస్థితి. రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చుచేస్తే తప్ప వచ్చిన వ్యాధి ఏమిటో తెలియదంటే వైద్యం తీరు అర్థమవుతోంది. షుగర్ వ్యాధి గ్రస్తులు ప్రముఖ వైద్యుల వద్దకు వెళితే అయ్యే ఖర్చు రూ.5 వేలు. వ్యాధితో ఆసుపత్రిలో చేరితే లక్ష నుండి రెండు లక్షల రూపాయలు బిల్లు వేయనిదే వారు వైద్యులనిపించుకోరు. ప్రతి ఆసుపత్రి తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతి ఆసుపత్రిలో వసూలు చేసే ఫీజుల వివరాలను రిసెప్షన్ కౌంటర్ దగ్గర నోటీస్ బోర్డులో ఉంచాలి. కానీ చాలా ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించడంలేదు. ఇదే అదునుగా జిల్లా వైద్యశాఖాధికారులకు కాసులవర్షం కురిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వైఎస్సార్ జిల్లాలో చాలా ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్ గానీ, ఫీజుల వివరాలు కానీ కానరావు. వైఎస్ఆర్ కడప జిల్లాలో దాదాపు 150 కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా అందులో సగానికి పైగా సక్రమమైన అనుమతులు లేని ఆసుపత్రులే ఉన్నట్లు తెలుస్తోంది.

ఆసుపత్రుల్లో వీపు విమానం మోత

బద్వేలు తదితర పట్టణాల్లోని కొన్ని ప్రవేట్ ఆసుపత్రుల్లో రోగి చికిత్స నిమిత్తం చేరితే గది అద్దె రూ.1,000ల నుండి రూ.2,000లు వసూలు చేస్తున్నారు. పరిస్థితి విషమించి ఐసీయూలో చేరితే రోజుకు రూ.3,000లు మానిటరింగ్ పెడితే రూ.1,500లు వెంటిలేటర్ అమరిస్తే రూ.6,000లు.. సర్జరీ జరిగి డ్రెస్సింగ్ చేయాలంటే రూ.500లు రోజూ చెల్లించాల్సిందే. ఐసీయూలో ఉండే డ్యూటీ డాక్టర్ పేరిట కూడా ఆసుపత్రి యాజమాన్యం ఒకొక్క రోగి నుంచి రూ. 500లు వసూలు చేస్తున్నాయి. స్పెషలిస్టు వైద్యులను పిలిపిస్తే వారికీ ఇవ్వాలంటూ రోజుకు రూ.1500 నుండి రూ.2,000లు బిల్లు చేస్తున్నాయి. ఇలా ఆసుపత్రి యాజమాన్యం ప్రతిదీ డబ్బుతో కొలమానం చేపట్టి రోగుల కుటుంబాలను వీధుల పాలు చేస్తున్నాయి. బద్వేలు పట్టణంలో అయితే మామూలు జ్వరానికే రూ.5,000లు తక్కువ బిల్లు కావడంలేదు.



కార్పొరేట్ ఆసుపత్రి

రోగ నిర్ధారణ మందులకు భారీగా కమీషన్లు

వైద్య వృత్తిలో అనుభవం ఉన్న వైద్యుడైతే రోగ లక్షణాలను నాడీ పనితీరును బట్టి అతనికి ఎలాంటి జబ్బు ఉందో ఇట్టే చెప్పేయగలరు. కానీ కొందరు వైద్యులు అవసరమున్నా లేకున్నా ప్రతి రోజూ వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరిట భారీగా కమీషన్లు గుంజుకుంటున్నారు. సిటీస్కాన్‌కు రూ.500లు, ఎంఆర్ఐకు రూ.2,000లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రూ.400లు ఇలా ఒకొక్క వైద్య పరీక్షలకు సంబంధించి సిఫారసు చేసిన వైద్యులకు కమీషన్లు వెళ్లుతుంటాయి. ఇవే కాకుండా రక్త, మల, మూత్ర పరీక్షలకు ల్యాబ్ నుంచి వైద్యులను బట్టి వారికి 30 నుంచి 50 శాతం కమీషన్లు చేరుతుంటాయి.

మందుల కొనుగోలుకు భారీగా ఆఫర్లు

ప్రవేటు ఆసుపత్రులకు అడుగడుగునా ఆదాయ మార్గాలు ఉన్నాయి. ఆసుపత్రిలో చేరే రోగుల నుండి మందులు తయారు చేసే కంపెనీల దాకా డాక్టర్లుకు దాసో హమయ్యారనేదీ అతిశయోక్తి కాదు. ఆసుపత్రులు ఫార్మా కంపెనీల నుంచి మందులు కొనుగోలుపైనా డాక్టర్లుకు కమీషన్లు ముడుతున్నాయి.

రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా పెట్టుబడులు

రోగులు నుంచి అడ్డంగా సంపాదించిన డబ్బులతో కొందరు వైద్యులు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారు. బద్వేలులో ఒక పిల్లల డాక్టర్ బద్వేలు పట్టణం చుట్టుపక్కల కోట్ల రూపాయల విలువచేసే దాదాపు 30 ఎకరాల ల్యాండ్ కొన్నారంటే ఆయన సంపాదన ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే కడపలో ఓ ప్రముఖ కార్పోరేట్ ఆసుపత్రి యజమాని పోరుమామిళ్ల పట్టణం చుట్టు పక్కల వంద ఎకరాలకు పైగా భూములు కొన్నట్లు తెలుస్తోంది. ఆ ఆసుపత్రికి ఒక సారి పోయిన రోగి మరల పోడని విమర్శలు ఉన్నాయి. అంతేగాకుండా బద్వేలు పట్టణంలోని మరి కొందరు డాక్టర్లు స్థలాలపై పెట్టు బడులు పెట్టడంమే గాకుండా కోటాను కోట్లు ఖర్చుచేసి విశాలవంత మైన లగ్జరీ భవంతులు నిర్మిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్ రంగం ఆంధ్రప్రదేశ్‌లో కుదేలు కావడంతో కర్నాటకలోని బెంగళూరు నగరంలో డాక్టర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు సమాచారం. అక్కడ అపార్టుమెంట్లు, భూములు కొనుగోలు చేస్తున్నట్లు వినికిడి. కడపలో దాదాపు పదికి పైగా ప్రవేట్ ఆసుపత్రుల యజమానుల ఒకొక్కరి ఆస్తి ఇప్పుడు దాదాపు రూ.100 కోట్ల నుండి రూ.150 కోట్లు దాటినట్లు చర్చ జరుగుతోంది. బద్వేలులో రూ.50 కోట్ల ఆస్తి దాటిని డాక్టర్లు ఇద్దరు ముగ్గురున్నట్లు ప్రజల్లో విమర్శలు ఉన్నాయి. ఇంతలా రోగుల నుంచి వారు వాడే మందుల నుంచీ లక్షలు..కోట్లు సంపాదిస్తున్న డాక్టర్లపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు కుబేరులు అవుతున్నారు. రోగులు అప్పులపాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రవేట్ ఆసుపత్రులపై నిఘా ఉంచి ప్రజలను దోచుకో కుండా సరైన వైద్యం చేసి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో శనివారం ఉదయం 10-30 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వాహనాల తనిఖీ

కాశినాయన : మండలంలోని ఓబులాపురం మూడు రోడ్లు కూడలిలో శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కాశినాయన ఎస్ఐ యోగేంద్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్ల అద్దాలకు నలుపు పేపర్ వేసిన కార్లను ఆపి కేసు నమోదు చేశారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పలు వాహనాలకు జరిమానా విధించారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసన్న లక్ష్మీ 50వ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లె, నంద్యాలంపేట ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులోని 220 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ రెండు ఫీడర్లలో ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈఈ కోరారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఏఓ అమరనాథ్ రెడ్డి, వేదికపై ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

దువ్వూరు : అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం దువ్వూరులోని మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి 250 క్వింటాళ్ల జీలుగల విత్తనాలు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో కొన్ని గ్రామాలకు 50 శాతం సబ్సిడీతో జీలుగల విత్తనాలు అందించామన్నారు. మరో 250 క్వింటాళ్లు సోమవారం వస్తాయని, వాటిని రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. గతంలో డీకేటీ భూములకు రైతు భరోసా పథకం అందేదని, ఇప్పుడు డీకేటీ భూములకు ఈ పథకం అందకుండా చేస్తున్నారని కొందరు ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. భూ సర్వే జరుగుతుండటం వల్ల ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్నామని, అందువల్ల డీకేటీ భూములకు అన్నదాత సుఖీభవ పథకం అందడం లేదని తహసీల్దార్ సంజీవరెడ్డి తెలిపారు. హౌసింగ్ డీఈ రమేష్ బాబు మాట్లాడుతూ మండలానికి 949 గృహాలు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 750 గృహాలు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహాలకు ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు, బీసీలకు రూ.50వేలు అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. మండలంలో అర్హులు ఎవరైనా ఉంటే ఆధార్, రేషన్ కార్డులు తీసుకుని హౌసింగ్ కార్యాలయంలో కొత్త గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓ భాస్కర్, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సీడీపీఓ ముంతాజ్ బేగం, ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్, మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, కళావతి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి



ఏఓకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చాపాడు : విధి నిర్వహణలో పని ఒత్తిడి తగ్గించాలని, వివిధ రకాలైన యాప్‌లతో పని భారం పెరిగి ఇబ్బందులకు గురవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. పని భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణలో భాగంగా ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ అభిప్రాయాలను సేకరిస్తోందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి రోజూ ఉదయం 6గంటలకే చెత్త బండ్ల వెంబడి పంచాయతీ కార్యదర్శులు వెళ్లి అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ఆదేశాలివ్వడం ఇబ్బందికరంగా ఉందన్నారు. మంచినీటి మోటార్ల నిర్వహణ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించాలన్నారు. ఇదే క్రమంలో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ బాధ్యతలు తొలగించి కేవలం పంచాయతీ పర్యవేక్షణ అప్పగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల జిల్లా యూనియన్ ఆదేశాల మేరకూ శనివారం సామూహిక సెలవుపై వెళ్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ మేరకూ ఎంపీడీఓ కార్యాలయ ఈఓ రామానుజంకు పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్, వేణు, శ్రీనివాసులు, సురేష్, పద్మావతి తదితతరులు పాల్గొన్నారు.

గాండ్ల తెలికుల కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందచేస్తున్న గాండ్ల తెలికుల సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గాండ్ల తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి.నాగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడచిందని, ఇంత వరకు గాండ్ల తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించక పోవడం దారుణమన్నారు. వివిధ కులాలకు కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి రాష్ట్ర జనాభాలో దాదాపు 10 శాతం ఉన్న తమకు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించక పోవడం తగదన్నారు. అలాగే తమకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని పంపనున్నట్లు తెలిపారు. దీనికి స్పందించిన తహసీల్దార్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ జీసీ పుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

సంజీవ్‌నగర్‌లో పర్యటించిన కమిషనర్



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని సంజీవ్‌నగర్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పర్యటించారు. మురికి కాలువలను సకాలంలో పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదని, తెల్లవారుజామున 4 గంటలకు మంచినీటి సరఫరా చేస్తున్నారని ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. గ్యాంగ్ వర్క్ నిర్వహించి కాలువలోని పూడికను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజల కోరిక మేరకు ఉదయం 5 గంటలకు నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రధాన రహదారి వద్ద ఖాళీ స్థలం వద్ద ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సుబ్బారెడ్డి, ఎస్.నూర్‌బాషా, ఎం.గోవిందరెడ్డి, 7వ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలి

- నకిలీ డాక్యుమెంట్ల తయారీదారులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



నకిలీ డాక్యుమెంట్లు చూపిస్తూ మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో నకిలీ డాక్యుమెంట్ల తయారీదారులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుని ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దొరసానిపల్లెలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడంతోపాటు నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి సీళ్లు వేసి ఆస్తులను మార్పిడి చేస్తున్నారని రాచమల్లు తెలిపారు. వీటన్నింటిని గుర్తించిన తాను ప్రతిపక్ష నేతగా ప్రజలను చైతన్య పరిచేందుకు సమావేశం ఏర్పాటు చేశానన్నారు. ఆస్తులు కొనేటప్పుడు, అమ్మేటప్పుడు ఒకటికి రెండు మార్లు ఈసీలు, లింక్ డాక్యుమెంట్లను చెక్ చేసుకోవాలని అవసరం ఎంతైనా ఉందన్నారు. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్‌యాదవ్ స్థలానికి సంబంధించిన వివాదంలో భోగస్ డాక్యుమెంట్ల తయారీ గుట్టు రట్టయిందన్నారు. 19వ వార్డుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ మునీర్ తన సోదరుడు బషీర్ పేరుతో రూ.500 స్టాంప్‌పై నకిలీ డాక్యుమెంట్ తయారు చేశారన్నారు. వాస్తవానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోని డాక్యుమెంట్ నంబర్ 547 స్థలం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఉందన్నారు. అయితే మునీర్ కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఈ స్థలం ఉన్నట్లు పత్రాలను సృష్టించాడన్నారు. భోగస్ పత్రాలను తయారు చేయడంతోపాటు ఈ ఆస్తిని మరొకరి పేరిట రిజిస్టర్ చేయించి కుదవకు పెట్టి ఉప్పలూరు గురుభాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.25లక్షలు తీసుకున్నారన్నారు. కుదవపెట్టిన ఈ స్థలాన్ని మునీర్ మరొకరికి అమ్ముతున్నానని చెప్పి అగ్రిమెంట్‌పై గురుభాస్కర్‌రెడ్డితో సంతకం చేయించుకున్నారన్నారు. స్థలం పూర్తి రిజిస్ట్రేషన్ తర్వాత మీ డబ్బు తిరిగి చెల్లిస్తానని మునీర్ అయనకు చెప్పారన్నారు. ప్రస్తుతం ఈ స్థలం వివాదంతో అసలు విషయం గుట్టు రట్టయిందని, విషయం తెలుసుకున్న గురు భాస్కర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఎంపీపీ శేఖర్ యాదవ్ 1982లో తయారు చేసిన వెంచర్‌లోని స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. జిల్లా ఎస్పీ ఈ సంఘటనపై విచారణ జరిపి నకిలీ డాక్యుమెంట్ల తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి ఇలాంటి వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే విషయంలో తాము ఎంత వరకైనా పోరాటం చేస్తామన్నారు. ఈ అంశంపై ప్రొద్దుటూరు డీఎస్పీకి వినతిపత్రం అందజేశామన్నారు. సమావేశంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, బాణా కొండారెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మొల్లమాంబ చిత్రపటాలు ప్రదానం

బద్వేలు అర్బన్ : తెలుగు రామాయణ తొలి కవయిత్రి మొల్లమాంబ చిత్రపటాలను శుక్రవారం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు అందజేశారు. ఈ సందర్భంగా మొల్ల సాహిత్యపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంటహనుమంతరావు మాట్లాడుతూ స్త్రీజాతికి వన్నె తెచ్చిన మహిళామూర్తి మొల్లమాంబ తమ ప్రాంత వాసి కావడం అదృష్టమన్నారు. వందలాది రామాయణాలు ఉన్నా మొల్ల రామాయణానికి సాహిత్యలోకంలో అఖండ కీర్తి లభించిందన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మొల్లమాంబ చిత్రపటాలను అందించనున్నట్లు ఆయన తెలిపారు. మొల్ల సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

సగిలేరు గురుకుల పాఠశాలను తరలించడం దారుణం

బి.కోడూరు : మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాలను బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లి గ్రామ సమీపంలోని మహా గురుకుల పాఠశాలకు తరలించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దురాహుల్ తెలిపారు. శుక్రవారం బి.కోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలోని గురుకుల పాఠశాల దాదాపు కొన్ని ఏళ్ళ నుండి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. పోరుమామిళ్ళ, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాలు, చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు సగిలేరు గురుకుల పాఠశాల ఉపయోగపడుతుందని, కానీ ఇప్పుడు బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లి గ్రామ సమీపంలోని మహా గురుకుల పాఠశాలకు తరలించడం చాలా దారుణమన్నారు. పూర్తి స్థాయిలో విద్యార్థులు అక్కడ చేరినప్పటికీ క్లాస్ రూమ్స్, బాత్‌రూమ్స్ వంటి వసతులు లేక ఇబ్బందులు పడతారని తెలిపారు. విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. వెంటనే సగిలేరు గురుకుల పాఠశాలను యధావిధిగా పాఠశాలను కొనసాగించాలని, జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, రాజశేఖర్, నాయకుడు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దు



టంగుటూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ భవాని

రాజుపాళెం : ప్రజలు ఫ్యాక్షన్ జోలికి వెళ్లకూడదని ట్రైనీ డీఎస్పీ భవాని తెలిపారు. మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలోని శ్రీమదనగోపాలస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఫ్యాక్షన్ , సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని గొడవలు పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా లింకులు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని, వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. కార్యక్రమంలో రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణ, పోలీసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల అక్రమాలపై విచారణ చేపట్టాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మడకలవారిపల్లె సమీపంలో గల అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజనం అందించకుండా నాసిరకం భోజనం అందిస్తున్నారని అన్నారు. ఆరు నెలలుగా పాఠశాలకు కేటాయించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రిన్సిపల్ ఉపయోగించడం లేదని అన్నారు. గురుకుల పాఠశాలను పరిశీలించాలంటే జిల్లా కలెక్టర్ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ అనుమతి ఉండాలని ప్రిన్సిపల్ కొత్త నిబంధనలు పెడుతూ ఎవరినీ లోపలికి అనుమతించకుండా ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే జిల్లా అధికారులు గురుకుల పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు మధు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.